క్లుప్తంగా

చికెన్ పాక్స్‌పై భయాందోళన వద్దు



కోటవురట్ల కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమణారావు

కోటవురట్ల: చికెన్ పాక్స్ పట్ల భయాందోళన చెందనవసరం లేదని, తగు నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి బయటపడవచ్చని డాక్టర్ రమణారావు అన్నారు. స్థానిక కేజీబీవీలో నర్సీపట్నానికి చెందిన రావ్స్ హోమియోపతి ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ రమణారావు మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సరితాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

రాంబిల్లి(యలమంచిలి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ సిహెచ్.నరసింగరావు సోమవారం రాత్రి తెలిపారు. మండలంలో పెదకలవలాపల్లి గ్రామంలో 12 మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, ఆయన నుంచి రూ.1800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



పాయకరావుపేట జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో 251 మంది, కార్తికేయ కళాశాలలో 342 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 270 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: మండలంలో దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ప్లాంక్‌లు, పెన్నులు, కాంపస్ బాక్సులను అందజేశారని హెచ్ఎం వేమగిరి నూకరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు దండుబలరామరాజు, గొర్లనర్సింహమూర్తి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంగరాజు పెదరాము, గణపతిరాజు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సోమవారం జాగరణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి విగ్రహానికి ఉత్సవ కమిటీ సభ్యులు క్షీరాభిషేకంతో, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం సింధూర పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం రేపు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం బుధవారం జరగనుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర రాజకీయ నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఎడాపెడా

ట్రాఫిక్ చలానాలు..!





వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

పోలీసు శాఖ కొరడా..!

నిబంధనలు పాటించని వాహనచోదకులపై పోలీసు శాఖ కొరడా ఝుళిపిస్తోంది. నిత్యం ఎక్కడో చోట రోడ్డు ప్రమాదాలు జరగడం.. గాయాలు పాలు కావడంతో పాటు మృత్యువాతకు గురవుతూనే ఉన్నారు. ఎన్ని నిబంధనలు అమలు చేస్తున్నా వాహనచోదకులు కూడా తమకు పట్టనట్లు వ్యవహరించడంతో హైకోర్టు కూడా పోలీసు శాఖను ఇటీవల మందలించింది. తప్పని పరిస్థితుల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి పోలీసు అధికారులు ట్రాఫిక్ రూల్స్ పక్కాగా అమలు జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పొట్ట కూటి కోసం వాహనాలపై వెళ్తుంటే ఏదో షాకు చూపించి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించడంతో ఆగ్రహావేశాలు వాహనదారుల్లో వ్యక్తమవుతున్నాయి.

మునగపాక: మోటారు వాహనాల చట్టం నిబంధనల ప్రకారం ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారికి ఈ చలానాలు జారీ చేస్తున్నారు. తమ లక్ష్యం చేరేందుకు పోలీసులు ఎడాపెడా జరిమానాలు వేస్తున్నారు. దీనిపై వాహనచోదకులు పెదవి విరుస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా పలు రూపాల్లో జరిమానాలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్న సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతున్నారు. ప్రమాదాల నివారణకు చట్టాలు అందుబాటులోకి తీసుకొస్తున్నా మితిమీరిన జరిమానాలు విధించడాన్ని వాహన చోదకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

కొత్త రూల్స్.. జరిమానాలు ఇలా..

మార్చి ఒకటో తేదీ నుంచి కొత్తగా అమలులోకి వచ్చిన చట్టం మేర ప్రభుత్వం ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడంతో పాటు జరిమానాలు **విధి**స్తున్నట్లు అధికారులు తెలిపారు.

- హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే రూ.1000 **జరిమానా**
- సీటు బెల్ట్ పెట్టుకోకుండా కారు డ్రైవింగ్ **చేస్తే** రూ.1000
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10వేలతో పాటు లైసెన్స్ కూడా రద్దు
- సిగ్నల్ జంప్‌తో పాటు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే రూ.1000 జరిమానా
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేలు ఫైన్
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే తొలిసారి రూ.2వేలు, రెండోసారి రూ.4వేల వంతున జరిమానా
- సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే తొలిసారి రూ.1500, రెండో సారి రూ.10వేల మేర **జరిమానా**
- బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.1000
- రవాణా వాహనాల్లో పరిమితికి మించి లోడు వేస్తే రూ.20వేలు
- ద్విచక్ర వాహనం వెనకన కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలంటూ నిబంధనల్లో పేర్కొన్నారు. లేకుంటే అతనికి కూడా రూ.1000 జరిమానా విధిస్తారు.
- యూనిఫాం లేని ఆటో డ్రైవర్లకు రూ.300 చొప్పున ఫైన్
- 108 వాహనంతో పాటు ఇతర అత్యవసర వాహనాలకు దారివ్వకుండా ఆటంకం కలిగిస్తే రూ.10 వేలు జరిమానా

భారీ చలానాలతో ఇబ్బందులు



ట్రాఫిక్ నిబంధనలు పేరిట తీసుకువచ్చిన కొత్త చట్టం ద్వారా జరిమానాలు భారీగా విధిస్తున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారు. పలు నిబంధనలను సవరణ చేసి జరిమానాలు తగ్గించేలా చూడాలి. ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.

– గుంట్ల అప్పారావు, ద్విచక్ర వాహనదారుడు, మెలిపాక

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కేంద్ర ప్రభుత్వం కొత్త మోటరు వాహన చట్టాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు. ట్రాఫిక్ నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలి. హెల్మెట్ వినియోగం వంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలి.

– పి.ప్రసాదరావు, ఎస్ఐ, మునగపాక

పెట్రేగిపోతున్న ఇసుకాసురులు

కోటవురట్ల: ఇసుకాసురులు పెట్రేగిపోతున్నారు. అడిగేవారు, దాడులు చేసేవారు లేకపోవడంతో ఇష్టానుసారంగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వరాహ నదీ గర్భాన్ని చీల్చి ఇసుకను కొల్లగొడుతున్నారు. అడ్డూఅదుపు లేకుండా అదేపనిగా ఇసుకను తరలించి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ ఇసుకాసురులకు కాసులు కురిపిస్తోంది. వరాహనదిలో పలు ప్రాంతాలలో అనధికారిక రీచ్‌లను చేపట్టి అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నారు. గ్రామాభివృద్ధి నెపంతో వేలం నిర్వహించి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. మొన్న గొట్టివాడలో వేలం నిర్వహించగా ఇటీవల పందూరు వరాహనదిలో కూడా ఇసుకను తరలించేందుకు అనధికారిక వేలం వేశారు. ఇక్కడ నదిలో మూడు నెలల పాటు ఇసుకను తవ్వుకోవడానికి రూ.22.50 లక్షలకు ఓ వ్యక్తి వేలం పాడుకున్నాడు. మద్యం సిండికేట్ మాదిరిగా గ్రూపుగా ఏర్పడి పలు ప్రాంతాలలో ఇసుకను తరలించుకుపోయేందుకు సిద్ధమవుతున్నారు. తలో పదికెడు అన్నట్లుగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



గ్రామ పెద్దల సమక్షంలో చెక్కును అందిస్తున్న నీలాపు వెంకట కృష్ణారెడ్డి

పాయకరావుపేట: మండలంలోని కుమారపురంలో తలపెట్టిన శ్రీకుమార ఉమా రామలింగేశ్వర శివాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన నీలాపు వేణు వెంకట కృష్ణారెడ్డి రూ.3,33,333 విరాళం అందజేశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ విరాళాన్ని చెక్కు రూపంలో గ్రామ పెద్దలకు అందించారు.

'గాదె' ఎన్నికపై హర్షం

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంపై వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో అధికార పార్టీ నాయకులు ప్రలోభాలకు గురిచేసినా, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతను ఉపాధ్యాయులు ఓటు రూపంలో చూపించారన్నారు. రాజకీయాలకు తావివ్వకుండా ఇటువంటి ఎన్నికలు జరిగేవని, ఈ దఫా మాత్రం నేరుగా కూటమి ప్రభుత్వం ఓ అభ్యర్థికి ఓటు వేయాలని పిలుపునిచ్చి విస్తృత ప్రచారం చేశారన్నారు. అయినా ఓటమి తప్పలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తానని 9 నెలలుగా కాలం గడిపేస్తున్న చంద్రబాబుపై కూడా తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సంక్షేమ పాలన అన్ని వర్గాలకు చేరువ చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

'ఉపాధ్యాయుల తీర్పు కూటమికి చెంప దెబ్బ'



వీసం రామకృష్ణ

నక్కపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు కూటమి పార్టీలకు, ప్రభుత్వానికి చెంప దెబ్బ అని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కూటమి పార్టీలపై నమ్మకంతో ఉపాధ్యాయులంతా గత ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు మద్దతు ఇచ్చారన్నారు. కొద్ది నెలల్లోనే వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ కూటమి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహిస్తే కూటమి పార్టీలకు ఉపాధ్యాయులతో పాటు ప్రజలు కూడా ఓటేసే పరిస్థితిలో లేరన్నారు. కూటమి పార్టీలకు అధికారం ఈవీఎంలను మేనేజ్ చేయడం వల్లే వచ్చిందని ఆరోపించారు. పాకలపాటి రఘువర్మకు మద్దతుగా కూటమి పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ముఖ్యనాయకులు ఇంటింటికి, ప్రతి పాఠశాలకు తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. ఎన్నో ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత కేవలం పది నెలల్లోనే రావడం గొప్ప విషయమన్నారు. బూటకపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు రఘువర్మకు మద్దతు ఇస్తున్నామని బాహటంగా ప్రకటించినప్పటికీ ఓటమి పాలయ్యారంటే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనకు చరమ గీతం పాడేందుకు, ప్రభుత్వ పనితీరుకు కొలమానంగా ఈ ఎన్నికలను తీసుకోవచ్చని చెప్పారు. విద్యావంతులైన ఉపాధ్యాయులే ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మునగపాక హైస్కూల్ ఆవరణలో మానవహారం చేస్తున్న విద్యార్థినులు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న పట్టణ ఎస్సై సావిత్రి,మహిళా పోలీసు



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పీహెచ్‌సీ సీహెచ్‌వో దేవకాంత తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చదువులో రాణించాలంటే తప్పనిసరిగా ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. బాలికలు కష్టపడి ఇష్టపడి చదువుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను ఆమె వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, మీరాబి, ఏఎన్ఎం దేవకి, మహిళా పోలీసు వరలక్ష్మి, పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

యలమంచిలి రూరల్: మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, గీతాంజలి, కొంఐతాల డిగ్రీ కళాశాలల్లో పట్టణ పోలీసులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 'నిజ జీవితంలో మహిళ ఉన్నతిలో పురుషుల పాత్ర'అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలను పట్టణ ఎస్ఐ కె.సావిత్రి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు

పాయకరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పాయకరావుపేటలోని గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కార్యాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అవగాహనా ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సౌజన్య, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : బాల్య వివాహాలపై పూడిమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను మహిళా సంరక్షణ కార్యదర్శులు రేవతి, రత్నకుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అపరంజిని, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్.రాయవరం: వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత అని అనకాపల్లి డివిజన్, యలమంచిలి రేంజ్ పాయకరావుపేట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్లు ఎల్.విజయ్‌కుమార్, ఎం.కృష్ణ అన్నారు. చినగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వన్యప్రాణులను ఎలా రక్షించాలి, వాటి వల్ల ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్తిబాబు, పీడీ ప్రేమ్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.రమణమ్మ, పి.ఆచారి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ బి.వై.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ రాజు మృతికి సంతాపం



మల్లవరం వీఆర్ఏ రాజు మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

మునగపాక: మండలంలోని మల్లవరం వీఆర్ఏ రాజు మృతికి సోమవారం రెవెన్యూ అధికారులు సంతాపం తెలిపారు. రాజు మునగపాక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో మల్లవరంలో రాజు అంత్యక్రియలు నిర్వహించారు. డీటీ శేషుబాబు, వీఆర్వోలు బీవీ సత్యనారాయణ, వీరన్న, తదితరులు రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

పరిశ్రమల ఏర్పాటుకు రుణాల మంజూరు



కొత్తగా మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం రమణ

అనకాపల్లి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం జనరల్ మేనేజర్ జి.ఎస్.వి.రమణ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు సన్‌కాస్ట్ ఫంక్షన్ హాల్లో సోమవారం అనకాపల్లి, అల్లూరు సీతారామరాజు జిల్లాల వ్యాపారస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వల్ల సబ్సిడీ ఎక్కువగా వస్తుందన్నారు. అనంతరం కొత్తగా వ్యాపారాలు చేసుకునే రెండు జిల్లాల మహిళా వ్యాపారులకు రూ. 20 కోట్ల రుణాలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ యూనియన్ జోనల్ హెడ్ షాలిని, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా డీఆర్‌డీఏ పీడీ సచిదేవి, బ్యాంక్ డీఐజీ జీఎం నాగరాజు, డీఆర్‌హెచ్ పి.ఎస్.రాజా, చీఫ్ మేనేజర్లు సింధుసాగర్, ప్రియంవర, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, మేనేజర్లు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో పీఆర్‌టీయూ విజయోత్సవాలు



నక్కపల్లిలో సంబరాలు జరుపుకొంటున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరపున పోటీ చేసిన గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంపై నక్కపల్లిలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను గాదె పరిష్కరించారన్నారు. ఈ సంబరాల్లో పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు టీవీ రమణ, ప్రగడ శివాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.చలపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి.సన్యాసిరావు, మండల నాయకులు ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాసరావు, లోవకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయ వ్యాధి నివారణ సాధ్యమే



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేష్

రాంబిల్లి(యలమంచిలి): క్షయని ముందుగా గుర్తించి మందులు వాడితే వ్యాధి నివారణ సాధ్యమేనని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. ప్రధానమంత్రి టీబీ విముక్తి భారత పంచాయతీలుగా రాంబిల్లి మండలంలోని మురకాడ, మామిడివాడ, కట్టుబోలు, లాలం కోడూరు గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ మేరు సోమవారం దిమిలి పీహెచ్‌సీలో ఆయా పంచాయతీల కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పంచాయతీ కార్యదర్శులకు జిల్లా వైద్యా ఆరోగ్యశాధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు జారీ చేస్తామన్నారు. దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రోజు విడిచి రోజు జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే క్షయగా అనుమానించి వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, పంచాయతీ కార్యదర్శులు కె.అమ్మాజీ, బి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నేడు

దేవరాపల్లి: మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మహిళల కోలాటం, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బకాయిల కోసం కార్మికుల ధర్నా



జోనల్ కార్యాలయం గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి: గతేడాది అక్టోబర్ నుంచి బకాయి పడిన జీతాలను తక్షణమే చెల్లించాలని జోన్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు స్థానిక జోనల్ కార్యాలయం గేటు వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకుడు నరసింహారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కార్మికుల కష్టాలు పెరిగిపోయాయన్నారు. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ గతేడాది అక్టోబర్ మాసం నుంచి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జోనల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకుని కార్మికుల జీతాలు చెల్లించాలని ఆయన కోరారు. లేని పక్షంలో సమ్మెకు సిద్ధం కానున్నట్లు తెలిపారు.